*Pavitra Qur'an mein Manavta ki shiksha*
*(Hindi)*

# పవిత్ర ఖుర్‌ఆన్‌లో మానవతా సందేశం


హిందీ మూలం

**విజయ్ గోపాల్ మంగళ్**

తెలుగు అనువాదం

**ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**



**తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్** (Regd.)

సందేశభవనం, లక్కడ్‌కోట్, ఛత్తాబజార్,

హైదరాబాద్-2. ఫోన్:040-24564583

**PAVITRA QUR'AN LO MANAVATA SANDESHAM**

***Pavitra Qur'an mein Manavta ki shiksha***

***(Hindi)***

**TIP Series No. : 358**

Writer : Vijay Gopal Mangal

Translated by : Muhammad Azeez ur Rahman

*All Rights Reserved with Publishers*

1st Edition : May 2024

Copies : 1000

**Price : Rs.35**

Published by : **Telugu Islamic Publications Trust (Regd.)**
Sandesha Bhavanam,
Lakkadkot, Chatta Bazar,
Hyderabad-500 002. India.
Phone: 24576237, 24564583
e-mail: geeturaiweekly@gmail.com

Typeset by : Geeturai Graphics
Lakkadkot, Hyderabad-2.

Printed at : : Cosmic Printers
Lakkadkot, Hyderabad-2.

*బిస్మిల్లా హిర్రహ్మానిర్రహీమ్*

*దయామయుడు, కృపాశీలుడైన పరమేశ్వరుని పేరుతో...*

# ముందుమాట

ఈశ్వరుని మహత్పూర్వకమైన సృష్టి మానవుడు. జగతిలో అతనికి ఒక మహత్పూర్వకమైన స్థానం ప్రాప్తమై ఉంది. ఈశ్వరుడు మనిషికి బుద్ధిని ప్రసాదించి, అతనికి ఆలోచించే, అర్థం చేసుకునే, మంచీ చెడులను పరికించే విచక్షణాశక్తిని ఒసగాడు. అతనిపై చారిత్రక, నైతిక కర్తవ్య భారాన్ని మోపాడు. అతని ఆచరణలనుబట్టి మరణానంతర జీవితంలో స్వర్గ నరకాల నివాసాన్ని ఏర్పాటు చేశాడు. మనిషి తనపై మోపబడిన నైతిక, చారిత్రక ఉత్తర దాయిత్వాన్ని నిర్వర్తిస్తూ దానికి క్రియాత్మక రూపం ఇచ్చినప్పుడు అది 'మానవత్వం'గా పిలువబడుతుంది. మానవతలో న్యాయం, ధర్మం, ప్రేమ, జాలి, కరుణ, బంధుత్వం, మాన మర్యాదలు, శాంతి భద్రతలు వంటివన్నీ ఇమిడి ఉన్నాయి. ఈ కారణంగానే మానవ సమాజంలో మానవత్వం పరిమళించినప్పుడు అందులో న్యాయం,ప్రేమ, సత్సంబంధాల వాతావరణం సర్వసామాన్యమవుతుంది. యథార్థమేమంటే మానవ హృదయంలో ఈ మానవీయ భావాలు పెంపొందినప్పుడే సమాజంలో మానవత నైసర్గిక రూపంలో పరిఢవిల్లుతుంది. సృష్టికర్త మనిషిని సృష్టించినప్పుడే అతనిలో ఈ భావాలు, భావనలను ప్రోది చేశాడు. మనిషి తన కుత్సిత బుద్ధి కారణంగా దానికి భ్రష్టు పట్టిస్తాడనేది వేరే విషయం. మనిషి తనలోని మానవత్వానికి మసిపూసినప్పుడు, అతను మనిషి స్థాయి నుండి దిగజారిపోతాడు, అతని చరిత్ర పాశవికంగా పరిణమిస్తుంది. పిదప అలాంటి వారి ద్వారా ఎటువంటి వినాశకర పరిణామాలు సంభవిస్తాయంటే, వాటి మూలంగా మానవత విలవిల్లాడుతుంది. మానవ సముదాయంలో విచ్ఛిన్నం, విధ్వంసం, భయోత్పాతం సర్వవ్యాప్తమై పోతుంది.

ఈశ్వరుని తరపున సమస్త మానవాళి మార్గదర్శకత్వం కొరకు పంపబడిన ఉద్గ్రంథం పవిత్ర ఖుర్ఆన్. అందులో మానవ జీవితపు అన్ని విభాగాలలో మార్గదర్శకత్వం ఉంది. అసలు మనిషిని ప్రపంచంలో పంపటంలోని ముఖ్య ఉద్దేశ్యమేమిటో కూడా అందులో విడమరిచి చెప్పటం జరిగింది. మరణించిన తరువాత ఏం జరుగుతుందో కూడా అది మానవాళికి ఎరుకపరిచింది.

ఈ పుస్తకంలో ఖుర్ఆన్‌లో ప్రబోధించబడిన మానవతా సూత్రాలపై దృష్టి కేంద్రీకరించటం జరిగింది. పుస్తక రచయిత విజయ్ గోపాల్ మంగళ్‌జీ కామర్స్‌లో పట్టభద్రులు. భారత ప్రభుత్వ రంగంలో ఉన్నతోద్యోగి. ఈయన సత్యప్రియులు. దార్శనికత కల వ్యక్తి. అందువల్లనే ఈయన అనేక గ్రంథాల అధ్యయనం చేయసాగారు. ఈ క్రమంలోనే ఈయన పవిత్ర ఖుర్ఆన్‌తో సహా సంబంధిత ఇస్లామీయ సాహిత్యాన్ని కూడా అధ్యయనం చేశారు. అధ్యయనం పూర్తయిన మీదట తన మనోభావాలకు (హిందీలో) అక్షర రూపం ఇచ్చారు. అదే మీ చేతుల్లో ఉన్న ఈ చిరు పుస్తకం. ఈ పుస్తకం చూడటానికైతే చిన్నదే కాని విషయం దృష్ట్యా ఇది ఒక చిన్న కడవలో నింపబడిన కడలి వంటిది. ఈ చిరు పుస్తకాన్ని తెలుగులో తర్జుమా చేయించి, ఒక సత్యప్రియుని మనోభావాలను జన సామాన్యం వరకు చేర్చటంలో మాధ్యమంగా ఉపయోగపడుతున్నందుకు మాకెంతో ఆనందంగా ఉంది.

సమాజంలో అవినీతిని, అసహనాన్ని, అపసవ్యతను అరికట్టడంలో, మానవత్వాన్ని, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడంలో ఈ పుస్తకం దోహదకారి కావాలని మేము ఈశ్వరుణ్ణి ప్రార్థిస్తున్నాము.

ఈ చిరు పుస్తకాన్ని పూర్తిగా, నిష్పాక్షిక దృష్టితో అధ్యయనం చేయాలని పాఠకులకు విజ్ఞప్తి చేస్తున్నాము.

**- ప్రకాశకులు**

# పవిత్ర ఖుర్‌ఆన్‌లో మానవతా ప్రబోధనలు

**ఆరంభే తదనుధ్యానమ్ భక్తా భక్తైై నిర్సేవితమ్**
**మార్గదర్శనం మనుష్యాణాం ప్రేషితై గూట్ శోధనమ్**

ప్రప్రథమంగా నేను ఆ ఏకేశ్వరుణ్ణి (అల్లాహ్‌ను) ధ్యానిస్తున్నాను. ఆయన్ని సేవించిన భక్తులు తమ జీవితాన్ని సఫలీకృతం చేసుకున్నారు. ఆయన మనుషులకు మానవత్వ (సదాచార) ప్రబోధనం చేశాడు. తన సందేశహరుల (ప్రవక్తల) ద్వారా పరమ రహస్యాల, పరమార్థాల శోధన (స్పష్టీకరణ) చేయించాడు.

ఖుర్‌ఆన్ సారం అంతా దాని మొదటి అధ్యాయం ఫాతిహా సూరాలో ఉందంటారు. ఆరంభంలో పేర్కొనబడిన శ్లోకం ఆ భావాన్నే అభివ్యక్తం చేస్తోంది. పవిత్ర ఖుర్‌ఆన్ ముస్లింల జాతీయ ధర్మగ్రంథంగా భావించ బడుతోంది. కాని వాస్తవానికి ఇది సమస్త మానవ జాతికి ఆధ్యాత్మిక సరోవరం. ఇందులో వొసగబడిన జ్ఞానాన్ని అల్లాహ్ తన ప్రత్యేక దూత జిబ్రయీల్ ద్వారా మహనీయ ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వ సల్లమ్) మనోఫలకంపై అవతరింపజేశాడు. అందుచేత ఇది కూడా వేదాల మాదిరిగా ఈశ్వరీయ ప్రోక్తం అనబడుతుంది. స్వయంగా ఖుర్‌ఆన్‌లో ఇలా సెలవీయబడింది :

**“నిస్సందేహంగా పవిత్ర ఖుర్‌ఆన్ సురక్షితమైన గ్రంథంలో భద్రపరచబడి ఉంది. పరిశుద్ధత నొందనంత వరకూ దానిని ముట్టుకో రాదు. ఇది సకల లోకాల స్వామి వద్ద నుండి అవతరించింది.”**
**(ఖుర్‌ఆన్, 56: 78–80)**

మొట్టమొదట హిరా పర్వత గుహలో **“ఇఖ్‌ర– బిస్మి రబ్బికల్లజీ ఖలఖ్”** (ఖుర్‌ఆన్, 96: 1) (చదువు. సృష్టించిన నీ ప్రభువు పేరుతో) అనే ఆయత్ మహనీయ ముహమ్మద్(సఅసమ్) మనోఫలకంపై అవతరించింది. తరువాత 23 ఏండ్ల వరకు (అంటే దైవప్రవక్త 40వ ప్రాయం మొదలుకుని 63 ఏండ్ల వయస్సు వరకు) కొద్దికొద్దిగా ఖుర్‌ఆన్‌లోని జ్ఞాన సుధ ఆయన(స) హృదయంలో ప్రోది చేయబడింది.

అయితే ఖుర్‌ఆన్ లిఖిత పూర్వక ప్రతిగా క్రీ.శ. 653లో ఖలీఫా మహనీయ ఉస్మాన్(రజి) కాలంలో క్రోడీకరించబడింది. ఈ పవిత్ర గ్రంథం 30 పారాలుగా లేదా 30 ఖండాలుగా విభజించబడింది. ఖుర్‌ఆన్ లోని కొన్ని ఆయత్‌లు మక్కా నగరంలో, మరికొన్ని ఆయత్‌లు మదీనా నగరంలో అవతరించాయి. అందుచేత దాని 114 అధ్యాయాలు మక్కీ, మదనీ (రెండు) భాగాలుగా విభజితమైనాయి. అయితే వాటిని, అవి అవతరించిన క్రమంలో పొందుపరచలేదు. తొలి అధ్యాయాలతో పోలిస్తే చివరి అధ్యాయాలు చిన్నవి. అధ్యాయానికి ‘సూరా’ అని నామకరణం చేయటం జరిగింది. దీని భాషా శైలి అత్యున్నతమైన అరబీకి ప్రతిబింబం. అది మనోహరంగానూ, మృదు మధురంగానూ, సరళంగానూ కవితా శైలిలో– ప్రవాహంలా– ముందుకు సాగుతుంది.

## ఆనాటి పరిస్థితి

ఆనాటి అరేబియా స్థితిగతులను, దైవప్రవక్త మహనీయ ముహమ్మద్ (సఅసమ్) జీవితాన్ని అవగతం చేసుకోవడానికి ప్రవక్త ప్రియ సహచరుడు మహనీయ జాఫర్(రజి) హబ్షా (అబిసీనియా) రాజు సమక్షంలో

విన్నవించుకున్న విషయాలు జాగ్రత్తగా గమనించదగినవి. ఆయన ఇలా అన్నారు–

"మహారాజా! మేము సుదీర్ఘ కాలంగా అసభ్యత, అనాగరికత, మార్గభ్రష్టతల అంధకారంలో తచ్చాడుతూ ఉండేవారం. అల్లాహ్‌ను (పరమేశ్వరుణ్ణి) మరచి విగ్రహపూజ చేసేవారం. మృత జంతువుల మాంసం తినేవారం. వ్యభిచారం, లూటీలు, దొమ్మీలు, దొంగతనం తదితర అత్యాచారాలు మా దైనందిన జీవితంలో అంతర్భాగమై ఉండేవి. బలవంతుడు బలహీనుణ్ణి దోచుకోవడాన్ని గర్వ కారణంగా భావించేవాడు. ఒక్క మాటలో చెప్పాలంటే మా జీవితం పశువుల కన్నా, క్రూర మృగాల కన్నా హీనంగా ఉండేది. పరమేశ్వరుడు (అలాంటి పరిస్థితిలో) మాపై దయదలిచాడు. స్వయంగా మాలో నుండే ఒక వ్యక్తిని తన ప్రవక్తగా ప్రభవింప జేశాడు. ఆ వ్యక్తి వంశ చరిత్ర, అతని జీవితం గురించి మాకు బాగా తెలుసు. అతను ఎంతో సచ్ఛీలుడు, సౌజన్యశీలుడు, నిజాయితీ పరుడు, సదాచార సంపన్నుడు, పుణ్యాత్ముడు. ఆయన సత్యసంధతను, సౌజన్యాన్ని మిత్రులే కాదు, శత్రువులు కూడా ప్రశంసిస్తారు. ఆయనే మాకు 'ఇస్లామ్' గురించి ప్రబోధించారు. దాని అర్థం ఈశ్వరుడు నిర్మించిన నియమాలను, ఆదేశాలను పాటించటం! మేము విగ్రహ పూజను వదలి, ఒకే దేవుడైన అల్లాహ్‌ను ఆరాధించాలనీ, ఆయన్నే ప్రభువుగా చేసుకోవాలని ఆయన బోధించారు. మేము సత్యమే పలకాలనీ, హత్యలు చేయడాన్ని, విధ్వంసం సృష్టించటాన్ని మానుకోవాలని ఆయన ఉపదేశించారు. అనాథల ఆస్తిని కబళించరాదనీ, పొరుగు వారికి సహాయం చేయాలని ఆయన తాకీదు చేశారు. వ్యభిచారం సహా దుష్కర్మలను పరిత్యజించాలనీ, నమాజ్ ఆచరించాలనీ, ఉపవాసాలు పాటించాలనీ, దైవమార్గంలో జకాత్ ఇవ్వాలనీ,

అగత్యపరులకు, నిరుపేదలకు సహాయం చేయాలని ఆయన బోధించారు.”

## మహనీయ ముహమ్మద్(సఅసమ్) గురించి

మహనీయ ముహమ్మద్(సఅసమ్) క్రీ.శ. 570లో అరేబియాలోని మక్కా నగరంలో జన్మించారు. పసితనంలోనే ఆయన తల్లిదండ్రులు చనిపోయారు. ఆయన పాలనా పోషణ బాధ్యతను పెత్తండ్రి అబూ తాలిబ్ స్వీకరించారు. యుక్త వయస్సుకు చేరిన తరువాత మక్కాలోని ఒక ధనిక వితంతువు ఖదీజా వద్ద ఉద్యోగంలో చేరారు. తరువాత 25 ఏండ్ల వయస్సులో- తనకన్నా పదిహేనేండ్ల పెద్ద అయిన ఆమెను వివాహ మాడారు.

ఆ కాలంలో అరేబియాలో విగ్రహ పూజ జరిగేది. ఒక్క కాబా గృహంలోనే 360 విగ్రహాలు ఉండేవి. మహనీయ ముహమ్మద్(సఅసమ్) తెగవారైన ఖురైషులు కాబా గృహానికి పురోహితులుగా ఉండేవారు. అయితే ముహమ్మద్(సఅసమ్) ప్రతి ఏటా కొన్నాళ్ళ పాటు హిరా పర్వత గుహలో ఏకాంతంలో దైవధ్యానం కోసం వెళ్ళేవారు. 40 ఏళ్ల వయస్సులో -క్రీ.శ. 610లో మహనీయ ముహమ్మద్(సఅసమ్)కు తొలిసారి దైవవాణి (Revelation) అందింది. ఆ తరువాత ఒకదాని తరువాత ఒకటిగా అనేకసార్లు ఆయనకు దివ్యావిష్కృతి ప్రాప్తమయింది. ఒక్క అల్లాహ్‌యే లోకేశ్వరుడనీ, ఆయన తనను సందేశహరునిగా ఎన్నుకున్నాడని దృఢ విశ్వాసం కలిగిన మీదట, ఆయన ఏకేశ్వరోపాసనా సందేశం ప్రజలకు అందజేయడానికి, సదాచారాన్ని ఉపదేశించడానికి పూనుకున్నారు.

లోకంలో సమాజ సంస్కరణా కార్యం వస్తుత: చాలా కష్టమైనది. లోకంలో ప్రాచుర్యంలో ఉన్న దురాచారాలను, దుష్కార్యాలను ఎండగట్టినప్పుడు సమాజం ఊరుకోదు. అనాదిగా వ్యవస్థీకృతమై ఉన్న ఆచార సంప్రదాయాలకు విరుద్ధంగా కనిపించిన నూతన విధానంపై ప్రజా

బాహుళ్యం విరుచుకుపడుతుంది. ప్రతీకార చర్యలకు పూనుకుంటుంది. దానిని ఆపడానికి సామదానభేద దండోపాయాలను ప్రయోగిస్తుంది.

తమ పూర్వీకుల నుండి వస్తున్న ఆచార సంప్రదాయాలపై నమ్మకం కలిగి ఉన్న అత్యధిక మంది ప్రజలు మహనీయ ముహమ్మద్(సఅసమ్)కు బద్ధ శత్రువులై పోయారు. అయినప్పటికీ ఆయన వారిని లక్ష్యపెట్టకుండా తన సందేశ కార్యాన్ని నిర్విఘ్నంగా నిర్వర్తించసాగారు. ఒకరోజు క్రీ.శ. 622లో– కురైషులు ఆయన్ని హతమార్చే ఉద్దేశంతో ఆయన నివాస గృహాన్ని చుట్టుముట్టారు. అయితే దైవ ప్రేరణతో ఆయనకు ఈ కుట్ర గురించి ముందుగానే తెలిసిపోయింది. అందుచేత ఆయన మదీనా నగరం వైపునకు ప్రస్థానం (హిజ్రత్) చేశారు. ఆనాటి నుండే హిజ్రీ శకం ప్రారంభ మయింది. మదీనా వాసులు ఆయన్ని హృదయపూర్వకంగా స్వాగతించారు.

మహనీయ ముహమ్మద్ (సఅసమ్) మదీనాలో కొంతకాలం ప్రశాంతంగా గడిపారోలేదో కురైషులు అక్కడకు కూడా చేరుకుని, తమ మాయమాటల్లో పడిన వారితో కలసి, అక్కడ కూడా నిశ్చింతగా ఊపిరి పీల్చుకునే అవకాశం లేకుండా చేశారు. చివరకు ఆత్మరక్షణకు సంబంధించిన మార్గాలన్నీ మూసుకుపోవడంతో గత్యంతరం లేని పరిస్థితిలో మహనీయ ముహమ్మద్(స) తన సహచరులతో కలసి ప్రతిఘటనకు పూనుకోవలసి వచ్చింది. ఫలితంగా ఖురైషులతో యుద్ధాలు మొదల య్యాయి. చివరకు మక్కా విజయంతో ఖురైషులతో యుద్ధ పరంపర సమాప్తమయింది.

దైవప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ఒక విశిష్టమయిన వ్యక్తి. సమీప భూతలంలో ఆయన స్థానం ఎవరికీ అందనంత ఉన్నతమైనది. మార్గాంతరం లేని పరిస్థితిలో ఆత్మరక్షణ నిమిత్తం ఆయన ఆయుధం చేబూనారని మేథావులు అంగీకరించారు. కాని తరువాతి కాలంలో కొంతమంది దీనిని తప్పుగా అర్థం చేసుకుని, ధర్మప్రచారం కొరకు ఖడ్గం

చేపట్టారని దుష్ప్రచారం చేశారు. యథార్థానికి ముహమ్మద్(స) బలవంతంగా ధర్మపరివర్తనకు అంగీకరించలేదు. ఖుర్‌ఆన్‌లో ఉన్నట్లు :

**"ధర్మం (దీన్) విషయంలో బలాత్కారానికి తావులేదు." (ఖుర్‌ఆన్, 2: 256)**

అకారణంగా రక్తపాతం సృష్టించడాన్ని మహనీయ ముహమ్మద్ (సఅసమ్) ఎన్నడూ ధర్మసమ్మతంగా భావించలేదు. ఖుర్‌ఆన్ ఇలా అంటోంది :

**వల్లాహు లా యుహిబ్బుల్ ఫసాద్**

"అల్లాహ్ కల్లోలాన్ని ఎంతమాత్రం ఇష్టపడదు." (ఖుర్‌ఆన్, 2: 205)

**లకుమ్ దీనుకుమ్ వలియ దీన్**

"మీ ధర్మం మీకు. నా ధర్మం నాకు" (ఖుర్‌ఆన్, 109: 6)

మత సహనం, సహిష్ణుతా భావం దృష్ట్యా ఈ ఆయత్ ప్రశంసనీయం.

## సనాతన ధర్మం ఇస్లామ్

ఇస్లామ్ ఏదో కొత్త మత వర్గాన్ని సృష్టించే సందేశం తీసుకుని రాలేదు. అనాదిగా (Immemorial Time) ఈ ప్రపంచంలో ప్రాచుర్యంలో ఉన్న మతధర్మం వైపునకే అది మానవాళిని పిలుస్తోంది. ఈశ్వరుని తరఫున నియుక్తులైన ప్రవక్తలంతా మానవాళిని ఈ ధర్మం వైపునకే పిలిచారు. ఆ ప్రవక్తలు ఏ జాతికి చెందినవారైనా, ఏ ప్రదేశంలో వారు ప్రభవించినా వారిచ్చిన సందేశం మాత్రం ఇదే. ఆ మాటే ఖుర్‌ఆన్‌లో చాలా స్పష్టంగా ప్రకటించబడింది.

**ఆయన నూహ్ ప్రవక్తకు ఆజ్ఞాపించిన ధర్మాన్నే నీకు కూడా నిర్ణయించాడు. దానినే (ముహమ్మద్-సఅసమ్) ఇప్పుడు నీ వైపునకు మేము వహీ ద్వారా పంపాము; దానినే మేము ఇబ్రాహీమ్‌కు,**

**మూసాకు, ఈసాకు బోధించాము; ఈ ధర్మాన్ని స్థాపించండి అనీ, దానిని గురించి విభేదాలకు లోనుకాకండి అనీ తాకీదు చేస్తూ. ఈ విషయమే ఈ బహుదైవారాధకులకు ఎంతో అసహనం కలిగించింది; దాని వైపునకే ముహమ్మద్(సఅసమ్) నీవు వారిని ఆహ్వానిస్తున్నావు. అల్లాహ్ తాను కోరిన వారిని తన వారుగా చేసుకుంటాడు. ఆయన తన వైపునకు మరలేవారికి మాత్రమే తన వైపునకు వచ్చే మార్గాన్ని చూపుతాడు. (ఖుర్ఆన్, 42: 13)**

అందువల్ల ఖుర్ఆన్ ఉపదేశాల ప్రప్రథమ ప్రాతిపదిక ఏమిటంటే, దేవుని తరపు నుండి వచ్చిన సందేశహరులందరినీ, దైవగ్రంథాలన్నింటినీ సమానంగా ఆదరించాలి. అంటే వారంతా సత్యంపై ఉండేవారనీ, దైవ సందేశాన్ని హెచ్చుతగ్గులు లేకుండా చేరవేసేవారని నమ్మి నడుచుకోవాలి. వారంతా ఒకే ధర్మపథాన్ని, ఒకే సిద్ధాంతాన్ని ప్రబోధించారని, వారి ప్రబోధనలకనుగుణంగా నడుచుకోవటమే మార్గదర్శకత్వమని, అదే లోక కళ్యాణ మార్గమని విశ్వసించాలి.

## ఇస్లామ్‌లో ఏకేశ్వరోపాసన

దేవుడు ఒక్కడేననీ, ఆయన సత్యం కూడా ఒక్కటేనని, దేవుని సత్యం ఆయన ఇతర ఉపదేశాల మాదిరిగా విశ్వజనీన వర ప్రసాదమని ఖుర్ఆన్‌లో ప్రబోధించబడింది. అవి ప్రత్యేకంగా ఏ ఒక్క కాలానికో, ఏ ఒక్క వంశానికో, జాతికో చెందినవి కావు. అవి దేదీప్యమానమైన సూర్యునిగా సర్వత్రా ప్రకాశమానమై, మనిషికి వెలుగునిస్తూ ఉంటాయి. కనుక మనిషి ప్రత్యేకంగా ఒక జాతి, ఒక భాష లేదా వర్గాన్ని సేవించ కుండా కేవలం దైవాన్ని సేవించాలి. ఖుర్ఆన్ ఇలా అంటోంది : అందరి ప్రభువు, పాలకుడు, పోషకుడు ఒక్కడే. ప్రతి వ్యక్తికీ అతని ఆచరణను బట్టి ప్రతిఫలం లభిస్తుంది. ఏక దైవారాధన, సదాచరణే మనిషి కర్తవ్యం. నేను ప్రతి దైవ సందేశహరుణ్ణి సమభావంతో చూస్తాను. సమానంగా

ఆదరిస్తాను. సమానంగా సమర్థిస్తాను. వారందరి సర్వసామాన్యమైన ప్రబోధనలే నా ప్రబోధన. మీరు గనక ధర్మంలోని నిజ ప్రబోధనలను చిత్తశుద్ధితో ఆచరించినట్లయితే నా పని పూర్తయినట్లే. ఎందుకంటే నా సందేశం ఏదో సరికొత్త సందేశం కాదు, దైవ సందేశ హరులంతా అందజేసిన సందేశమే నా సందేశం.

దైవ పరాయణత, సాటి మానవుని పట్ల మానవీయ వ్యవహారణే యథార్థ ధర్మం. ఏకేశ్వరోపాసన (ఏక దైవభావన) ద్వారా మానవతకు పరిపూర్ణత చేకూరుతుంది. తద్వారానే ప్రతి మనిషిలో మానవత్వ భావన వృద్ధి చెందుతుంది. ఈ భావన వ్యక్తిగత స్థాయిలో ప్రతి మనిషిలో వేర్వేరుగా ఉంటుంది. అయితే సామూహికంగా కొన్ని మానవీయ విలువలతో అందరూ ఏకీభవిస్తారు. మరి కొన్ని విషయాలున్నాయి. అవి చెడు అన్న విషయంలో అందరి మధ్యనా ఏకాభిప్రాయం ఉంది. ఇతరులకు లాభం చేకూర్చే కార్యాలను మనిషి చేపట్టినప్పుడు, అవి మానవతా పరిధిలోకి వచ్చే పనులై ఉన్నప్పుడు సమాజంలో దానికి ఆదరణ లభిస్తుంది. ప్రజలు వాటిని స్వాగతిస్తారు, శ్లాఘిస్తారు, వాటితో సహకరిస్తారు. ఉదాహరణకు– తల్లిదండ్రుల సేవ, పొరుగువారి పట్ల సద్వ్యవహారం, అనాథలను, నిరుపేదలను ఆదుకోవడం, బాధితులకు సహాయం చేయటం– ఇవన్నీ మంచి పనులు. దీనికి ఎదురుగా అన్యాయం, అత్యాచారం దుష్కార్యాలు. సమాజంలో దయ, ఔదార్యం, విశాల హృదయత, సానుభూతి లాంటి వాటిని సర్వత్రా ప్రశంసించటం జరిగింది. దీనికి ప్రతిగా కాఠిన్యం, కర్కశత్వం, స్వార్థ ప్రియత్వం, సంకుచిత బుద్ధికి ఎన్నడూ ఆదరణ లభించలేదు. చెప్పొచ్చినదేమంటే సన్మార్గాన నడిచేవారినీ, ధర్మనిష్ఠతో జీవించేవారినే మానవత తన వారిగా భావించింది. నమ్మకస్తులైన వారికీ, మాటలకు– చేతలకు మధ్య వైరుధ్యం లేకుండా వ్యవహరించే వారికీ, అంతర్బాహ్యాలు ఒకేవిధంగా ఉన్నవారికీ, తాము నమ్మిన సిద్ధాంతంపై స్థిరత్వం కలిగి ఉన్నవారికీ, తాము శాంతియుతంగా ఉండి ఇతరులను

కూడా ప్రశాంతంగా ఉండనిచ్చేవారికి మానవత సదా నీరాజనం పట్టింది. ఈ విషయాలు సాధారణంగా సర్వత్రా ప్రఖ్యాతి చెందినవి. వీటికి విరుద్ధంగా నడవటం సాధారణంగా సమంజసంగా భావించబడదు. ప్రపంచంలోని మత ధర్మాలన్నీ, ప్రపంచంలోని సిద్ధాంతాలన్నీ, భావాలు భావనలన్నీ, సముదాయాలన్నీ ఇతరత్రా విషయాలలో ఎంతగా విభేదించుకున్నా ఈ మానవీయ విలువల విషయంలో మటుకు ఏకాభిప్రాయం కలిగి ఉన్నాయి.

## సార్వజనీన సందేశం

సాధారణంగా మానవ సమాజంలో సత్కార్యాలుగా, స్వీకార యోగ్యమైన పనులుగా భావించబడే వాటినే మనిషి కొరకు దేవుడు అవశ్యంగా ఖరారు చేశాడని ఖుర్‌ఆన్‌లో చెప్పటం జరిగింది. అలాగే మానవ సముదాయంలో స్వీకార యోగ్యం కాని పనులను, ఆచారాలను దేవుడు మనిషి కొరకు నిషేధించాడని కూడా ఖుర్‌ఆన్ చెబుతోంది. ఈ విషయంతో మత ధర్మాలన్నీ ఏకీభవిస్తాయి. ఇది ధర్మం యొక్క మౌలిక తత్వం. అందుచేత ఈ విషయంలో విభేదాలకు తావు ఏర్పడలేదు. లోకంలో వివిధ మత వర్గాలు, అగణ్యమయిన భావాలు భావనలు ఉన్నప్పటికీ, ఎన్నో నిజాలను విస్మరించినప్పటికీ ఈ సత్యం మాత్రం ప్రాచుర్యంలో ఉంది. ఈ పనులలోని మంచి, చెడు విషయంలో ప్రపంచంలోని అన్ని మత ధర్మాలు, అన్ని జాతులవారు, అన్ని కాలాలలో ఏకీభవిస్తూ వచ్చారు. దీనినిబట్టే విదితమైపోతోంది– ఇవి దేవుని వద్ద నుండి మనుషుల కొరకు అందిన ఆదేశాలని! ఎందుకంటే ఖుర్‌ఆన్ దైవ ప్రసాదితమయిన సంవిధానం. అందుచేతనే అది కూడా చాలా స్పష్టంగా మంచిని (మేలును) చేయమని, అంటే 'మారూఫ్'ను పెంపొందించమని ఆజ్ఞాపిస్తోంది. చెడు నుండి, అంటే 'మున్‌కర్' నుండి వారిస్తోంది.

## ఇస్లామ్ ఒక ప్రకృతి ధర్మం

ఈ కర్మ మార్గమే (మానవతా విధానమే) మానవ సమాజం కొరకు ఈశ్వరుని ద్వారా నిర్ధారితమైందనీ, ఇదే ప్రకృతి ధర్మమనీ ఖుర్‌ఆన్‌లో ప్రబోధించటం జరిగింది. ఖుర్‌ఆన్ పరిభాషలో దీని పేరే **'అల్ ఇస్లామ్'.** ఈశ్వరుడు సమ్మతించి ఆమోదించిన నియమ నిబంధనలకు కట్టుబడి ఉండటం, ఆజ్ఞాపాలన చేయటం అని దీని అర్థం. ఈశ్వరుని ద్వారా నిర్మించబడిన నియమాలను పాటించవలసినదిగా ఖుర్‌ఆన్ చెబుతుందన్న విషయం సమస్త మనుజ జాతికి తెలుసు. అయితే ఇక్కడ ఒక ప్రశ్న ఉత్పన్నమవుతుంది– ఖుర్‌ఆన్ ప్రబోధిస్తున్న ఈ నియమాలను ప్రవేశపెట్టే శక్తి (Enforcing Power) ఏది? మనిషిని ఈ నైతిక శాసనాన్ని పాలించడానికి సమాయత్తం చేసే ప్రేరక శక్తులు (Motivating Forces) ఏవి? అన్న ప్రశ్న సహజంగానే జనిస్తుంది.

## మనిషి దైవసమక్షంలో జవాబు ఇవ్వవలసి ఉంది

ఖుర్‌ఆన్ ప్రకారం ఈశ్వరుడు (దేవుడు) ఒక్కడే. ఆయనే బ్రహ్మాండమైన ఈ జగతిని సృష్టించాడు. ఆయనే ప్రభువు, పాలకుడు, శాసించేవాడు. ఆయన అభీష్టం మేరకే సమస్త కార్యకలాపాలు నడుస్తున్నాయి. ఆయన సర్వజ్ఞుడు, సర్వ శక్తిమంతుడు. ప్రత్యక్షంగా, పరోక్షంగా జరిగే వాటన్నింటినీ ఎరిగినవాడు. మానవుడు ఆయన దాస్యం (ఆరాధన) కొరకే సృష్టించబడ్డాడు. కాబట్టి దైవాజ్ఞలకు కట్టుబడి, ఆయన్ని సేవించటం మానవుని కర్తవ్యం. ఆ ఈశ్వరుడు తన సందేశహరులను (ప్రవక్తలను) మానవుల మార్గదర్శకత్వం నిమిత్తం పంపాడు. వారు దైవగ్రంథాలను మానవాళికి పరిచయం చేశారు. ఇప్పుడు మనిషి కర్తవ్య మేమిటంటే, అతను తన దినచర్యను ఈ ఉపదేశాల కనుగుణంగా మలచు కోవాలి. మనిషి తన జీవితంలోని సమస్త కార్యకలాపాలకు దైవసమక్షంలో జవాబుదారుడు. జవాబు ఇచ్చుకోవలసింది ఈ ప్రపంచంలో కాదు,

మరణానంతర జీవితంలో నెలకొనే పరలోకం (ఆఖిరత్)లో అతని నిలదీత జరుగుతుంది. ఈ ప్రాపంచిక జీవితం కేవలం ఒక పరీక్షా సమయం. అందువల్ల మనిషి చేసే పనులన్నీ ఆ రోజు దైవ సమక్షంలో సఫలీకృతం అయ్యేలా ఉండాలి. దానిపైనే అతని భవితవ్యం ఆధారపడి ఉంటుంది. మనిషి ఈ ప్రపంచంలో ఇతరుల పట్ల ఎలా వ్యవహరిస్తాడో, అదేవిధంగా దైవ సమక్షంలో అతని యెడల– నిష్పక్ష పాతంగా– వ్యవహారం జరుగు తుంది. దేవుడు మనిషి ఆచరణల లెక్క మాత్రమే కాకుండా అతని మనోభావాల, సంకల్పాల లెక్క కూడా తీసుకుంటాడు.

ఖుర్ఆన్‌లో పేర్కొనబడిన ఈ విషయాల చుట్టూనే మనిషి నైతిక జీవితం పరిభ్రమిస్తూ ఉంటుంది. మానవ జీవితపు పరమ లక్ష్యం దైవప్రసన్నతను చూరగొనటం. ఇది సునిశ్చితమైన తరువాత నైతికతకు సార్థకత చేకూరుతుంది. దానికొక లక్ష్యం ప్రాప్తమవుతుంది. తద్వారా నైతికత వికాసమొందే అవకాశాలు పెంపొందుతాయి. మానవుడు స్వార్థ ప్రియత్వపు ఊబి నుంచి బయటపడతాడు.

## పరలోకం : ఒక నియామక శక్తి

ఖుర్ఆన్‌లో పేర్కొనబడిన ఈ సిసలైన మానవతా వాదిని తీర్చిదిద్దే నియామక శక్తి (Enforcing Power), ప్రేరకశక్తి, దైవభీతి, పరలోకంలో దైవ సమక్షంలో జవాబు ఇచ్చుకోవలసి ఉందనే భావనే. ఈ నైతిక ఉపదేశాలు చేయడంతోపాటే ఖుర్ఆన్ మానవ హృదయంలో నాటే మరో ముఖ్య విషయం ఏమిటంటే, దేవునితో మనిషికి ప్రత్యక్ష సంబంధం ఉంది. ఆయన అనుక్షణం, ప్రతి చోటా మనిషి చేసే పనులను గమనిస్తు న్నాడు. మనిషి ఈ లోకం దృష్టి నుండి దాక్కోగలడు. కాని దేవుని దృష్టి నుండి దాక్కోలేడు. మనిషికి ఈ ప్రాపంచిక జీవితం కొన్నాళ్ళపాటే లభిస్తుంది. అతను ఈ ప్రపంచంలో ఏం చేసుకున్నా ఒకానొక నాడు అతను మృత్యువాతన పడక తప్పదు. అతను చేసుకున్న కర్మలన్నింటికీ దేవుని

న్యాయస్థానంలో లెక్క ఇవ్వవలసి ఉంది. తీర్పుదినాన ఎవరి సత్కార్యాల త్రాసు (తక్కెడ, పళ్ళెం) బరువుగా ఉంటుందో, అతను స్వర్గంలో ప్రవేశిస్తాడు. మరెవరి త్రాసు తేలికగా ఉంటుందో అతను నరకానికి పోతాడు. స్వర్గంలో ప్రవేశించిన వారికి అన్నిరకాల సుఖ సౌఖ్యాలు ప్రాప్తమవుతాయి. నరకానికి ఆహుతి అయిన వారికి లెక్కలేనన్ని యాతనలు ఉంటాయి. ఆనాడు ఎవరూ ఎవరికీ ఏ విధంగానూ సహాయపడలేరు. అక్కడ ఎవరి వకాల్తా నడవదు. అబద్ధాలు, ప్రలోభాలు, కపట నాటకాలు నడవవు. సిఫారసులు చెల్లనేరవు. ఈ విధంగా ఆ రోజు మనిషి చేసుకున్న ఆచరణనుబట్టి– నిష్పక్షపాతంగా– న్యాయ నిర్ణయం జరుగుతుంది.

> **"ప్రతి మనిషికీ తాను దేని కోసం కృషి చేశాడో అదే అతనికి లభిస్తుంది." (ఖుర్ఆన్, 53: 39)**

ఈ రకమయిన నమ్మకాన్ని మానవ మనో క్షేత్రంలో నాటి, ఖుర్ఆన్ మనిషి హృదయంలో పోలీసు పికెటింగ్‌ను కూర్చోబెడుతుంది. అది నిరంతరం సదాచరణ నియమాలకు కట్టుబడి ఉండేలా మనిషిని వివశుణ్ణి చేస్తుంది. ఖుర్ఆన్ మానవజాతి నుండి, దేవుడు నిర్ధారించిన నియమాలతో కూడుకున్న జీవన ప్రణాళికను వాంఛిస్తుంది. అందులో నిషిద్ధ అంశాలు (మున్కర్) ఉండరాదనీ, మానవ సముదాయం సర్వదా స్వీకరించిన మంచి మాత్రమే అందులో ఉండాలని కోరుకుంటోంది. మానవుడు దేవుని ప్రతినిధి అయిన కారణంగా, తాను చేసే పనులన్నింటికీ దైవ సమక్షంలో జవాబుదారుడై ఉంటాడు. అందువల్ల ప్రపంచంలో మనిషికి వొసగబడిన అధికారాలు, సాధన సంపత్తులన్నీ దైవ ప్రసన్నతను చూరగొనే విధంగా వినియోగించటం అతని కర్తవ్యం.

## విశాల దృష్టి

ఖుర్ఆన్ ప్రాపంచిక జీవితంలో మానవ దృష్టిని వికసింపజేయ డానికి రెండు రకాల విషయాలను ప్రతిపాదిస్తోంది. ఒకటి: తాత్వికమైనది

(Philosophical Approach) రెండు: క్రియాత్మకమైనది (Applied/ Functional Approach).

తాత్విక స్థాయిలో ఖుర్ఆన్ ధార్మిక విశ్వాసం, అనువర్తనం, ఆత్మ నిగ్రహం, సదాచరణ ద్వారా మనిషిలో ఆత్మ వికాస మార్గాన్ని సునిశ్చితం చేస్తుంది. ఖుర్ఆన్ ప్రకారం మనిషి మనోమస్తిష్కాలలో అల్లాహ్‌యే తన స్వామి, ప్రభువు, నిజ ఆరాధ్య దైవమనీ, ఆయన ప్రసన్నతే తన సమస్త కర్మల లక్ష్యమనీ, దైవాజ్ఞే తన జీవన శాసనమనీ పరిపూర్ణ విశ్వాసం కలిగి ఉండాలి. ఈ విశ్వాసం ఎంత దృఢతరమైతే అంతే అధికంగా మనిషి మానవీయ మార్గంలో ఉన్నతికి చేరుకోగలుగుతాడు. మనిషి తన జీవితంలో ఏం చేసినా, తన మనోవాక్కాయ కర్మలకు జవాబు తన ప్రభువు ఎదుట ఇవ్వవలసి ఉందని గ్రహించి మరీ చేయాలి. మనిషి ఈ సద్గుణాలను, సదాచారాలను కేవలం తన వరకే పరిమితం చేయకుండా వాటిని ఇతరులలో కూడా సర్వసామాన్యం చేయడానికి ప్రయత్నించాలి.

> **"మీలో మేలు వైపునకు పిలిచే, మంచి పనులు చేయమని ఆజ్ఞాపించే, చెడుల నుండి వారించే ఒక వర్గం తప్పకుండా ఉండాలి. ఇలాంటి వారే సాఫల్యం పొందే వారలు." (ఖుర్ఆన్, 3 : 104)**

## ఇస్లామ్ క్రియాత్మక సిద్ధాంతం

ఖుర్ఆన్ వ్యక్తి, సమాజ సంస్కరణకు, ఆధ్యాత్మిక వికాసానికి ఏర్పరచిన సైద్ధాంతిక క్రియాత్మక వ్యవస్థకు నాలుగు మూల స్తంభాలు కలవు. 1) సలాత్ (నమాజ్, ప్రార్థన) 2) రోజా (రమజాన్ ఉపవాసాలు) 3) జకాత్ (విధిగా ఇవ్వవలసిన దానం), 4) హజ్జ్.

## నమాజ్

నమాజ్ అనుదినం ఐదు పూటలు మనిషి మనసులో దైవభావనను మేల్కొల్పుతుంది. దైవభీతిని జనింపజేస్తుంది. దైవం పట్ల ప్రేమను జాగృతం

చేస్తుంది. ఇంకా ఆయన ఆదేశాల ముందు ఆత్మసమర్పణ చేసుకోవాలనే భావనను రగుల్గొల్పుతుంది.

**"నిస్సందేహంగా నమాజ్ నీతిబాహ్యత నుండి, చెడు పనుల నుండీ ఆపుతుంది. ఇక అల్లాహ్ (నామ) స్మరణ అయితే చాలా గొప్ప విషయం." (ఖుర్ఆన్, 29: 45)**

నమాజ్ వ్యక్తిగతంగా, సామూహికంగా విధిగా పాటించాల్సిన అంశం. ఎందుకంటే దీని ద్వారానే యావత్ సమాజం సామూహికంగా సదాచరణ మార్గంలో ముందుకు సాగుతుంది. నమాజ్ స్థితిలో మనిషి దైవానికి సన్నిహితుడు అవుతాడు. దివ్యానుభూతికి లోనవుతాడు. నమాజ్ సమాజ సభ్యుల మధ్య సంఘీభావం పెంపొందిస్తుంది. సంఘ శక్తిని ఇనుమడిస్తుంది. ఆ సమయంలో ఒకే భాష, ఒకే స్వరం, ఒకే భావనతో ఆసియా, ఆఫ్రికా, ఐరోపా ఖండాలలోని ముస్లింలంతా అల్లాహ్ ఎదుట తమ భక్తిని అర్పించడానికి ఏకత్రమవుతారు. ఆ దృశ్యం ఎంత ఆనందభరితమైనది! ఎంత ఉత్సాహపూర్వకమైనది!! ఆ సమయంలో వెల్లివిరిసే సమానత్వం గురించి ఏమని చెప్పేది!? అందరూ ఒకే వరుసలో నిలబడి ఉన్నారు. వారిలో ధనిక– బీద తారతమ్యం లేదు. రాజు అయినా– పేద అయినా అందరూ ఈశ్వరుని సమక్షంలో సమానులేనని చాటి చెబుతారు. తమకు సన్మార్గం చూపమనీ, దురాచారాల నుండి, దుర్మార్గం నుండి తమను దూరంగా ఉంచమని నమాజ్‌లో అల్లాహ్‌ను వేడుకోవటం జరుగుతుంది.

## రోజా

**"విశ్వసించిన ప్రజాలారా! ఉపవాసం మీకు విధిగా నిర్ణయించ బడింది– ఏవిధంగా మీకు పూర్వం ప్రవక్తలను అనుసరించేవారికి కూడా విధించబడిందో. దీనివల్ల మీలో భయభక్తులు జనించే అవకాశం ఉంది. ఈ ఉపవాసం కొన్ని దినాల వరకే. కాని మీలో**

**ఎవరైనా వ్యాధిగ్రస్తులయితే లేక ప్రయాణంలోఉంటే, వేరే దినాలలో ఆ ఉపవాస దినాలను పూర్తి చెయ్యాలి. ఉపవాసం ఉండే శక్తి కలవారు (ఒకవేళ దానిని పాటించకపోతే) పరిహారం చెల్లించాలి. ఒక ఉపవాస దినానికి పరిహారం ఒక పేదవానికి భోజనం పెట్టడం. కాని ఎవరైనా సహృదయంతో ఇంకా ఎక్కువ పుణ్యం చేస్తే, అది వారికే మేలు. అయితే మీరు విషయాన్ని గ్రహించగలిగితే, ఉపవాసం ఉండటమే మీకు ఉత్తమం." (ఖుర్ఆన్, 2: 183, 184)**

రమజాన్ నెలలో విధిగా ఉపవాసాలు (రోజాలు) పాటించ వలసిందిగా ఖుర్ఆన్ ఆజ్ఞాపిస్తోంది. తద్వారా అది ముస్లిం సముదాయానికి వ్యక్తిగతంగానూ, సామూహికంగానూ నిగ్రహం, సంయమనం పాటించవలసినదిగా ఉపదేశిస్తుంది.

## జకాత్

జకాత్ ముస్లింలలో త్యాగాన్ని, సహకార భావాన్ని, పరస్పర సానుభూతి భావనను సృజిస్తుంది. దీనిని పన్ను (టాక్స్)గా భావించటం పొరపాటు. దీనివల్ల పేదలకు ఆర్థిక సహాయం లభిస్తుంది.

**"మీరు అమితంగా ఇష్టపడే వస్తువులలో నుండి (దైవ మార్గంలో) ఖర్చు పెట్టనంత వరకూ మీరు పుణ్యస్థాయికి చేరుకోలేరు."**

**(ఖుర్ఆన్, 3: 92)**

జకాత్ వాస్తవానికి దైవమార్గంలో ఖర్చుకు తార్కాణం. మనిషి తనలో ధన వ్యామోహం లేదనీ, తన వద్ద ఉన్న సంపద తనది కాదనీ, తన వద్ద ఉన్న సంపదను దేవుడు సూచించిన ప్రతి చోటా ఖర్చు పెట్టడానికి సిద్ధంగా ఉన్నాడనడానికి ప్రతీక జకాత్. ఈ విషయం పురుషులకు, స్త్రీలకు కూడా వర్తిస్తుంది. ఈ విధంగా ఖుర్ఆన్ దానధర్మాలకై మనుషులను ప్రేరేపించడంలో వేరితర గ్రంథాలకన్నా తక్కువేమీ కాదు.

## హజ్జ్

హజ్జ్ ఒక తీర్థయాత్ర. ముస్లింల మధ్యన విశ్వజనీన బంధుత్వాన్ని దృఢపరచటం దీని ప్రధాన ఉద్దేశం. దానిని నెరవేర్చే విధానం కూడా ఐకమత్యాన్ని, సంగఠితత్వాన్ని పెంపొందించే ఉద్దేశంతో నిర్ణయించటం జరిగింది.

ఖుర్ఆన్‌లోని అల్ బఖరా సూరా 177వ వచనం విశ్వాసపరమైన, క్రియాత్మకమైన– రెండు రకాల ఉద్దేశ్యాలను స్పష్టీకరిస్తోంది:

> **"సత్కార్యం అంటే మీరు మీ ముఖాలను తూర్పుకో పడమరకో త్రిప్పటం కాదు. సత్కార్యం అంటే మనిషి అల్లాహ్‌నూ, అంతిమ దినాన్నీ, దూతలనూ, అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథాన్నీ, ఆయన ప్రవక్తలనూ హృదయపూర్వకంగా విశ్వసించటం. ఇంకా అల్లాహ్ పట్ల ప్రేమతో తాము ఎక్కువగా ఇష్టపడే ధనాన్ని బంధువుల కొరకూ, అనాధుల కొరకూ, నిరుపేదల కొరకూ, బాటసారుల కొరకూ, సహాయం చెయ్యండి అని అర్థించేవారి కొరకూ, ఖైదీలను విడుదల చెయ్యటానికీ వ్యయపరచటం. ఇంకా నమాజును స్థాపించటం, జకాత్ ఇవ్వటం, వాగ్దానం చేస్తే దానిని పాలించేవారూ, కష్టకాలంలో, లేమిలో, సత్యానికీ, అసత్యానికీ మధ్య జరిగే పోరాటంలో స్థయిర్యం చూపేవారూ సత్పురుషులు. వాస్తవంగా సత్యసంధులు, అల్లాహ్ ఎడల భయభక్తులు కలవారు వీరే." (ఖుర్ఆన్, 2: 177)**

ఖుర్ఆన్‌లో ఖుర్బానీ (త్యాగం) ప్రస్తావన కూడా వచ్చింది. దీని ముఖ్య ఉద్దేశం మనిషిలో సంయమనాన్ని, నిస్వార్థ సేవాభావాన్ని, త్యాగనిరతిని, ధర్మనిష్ఠాపరాయణతను సృజించటం. ఒకచోట ఈ విధంగా సెలవీయబడింది :

> **"దైవానికి ఖుర్బానీ పశువుల మాంసంగానీ, వాటి రక్తంగానీ చేరదు. మీ ధర్మనిష్ఠ (తఖ్వా) మాత్రమే చేరుతుంది." (ఖుర్ఆన్, 22: 37)**

ఈ విధంగా ఖుర్ఆన్ వస్తుత: మనుషులమైన మనల్ని ఔదార్యం, విశాల హృదయత కలవారుగా తీర్చిదిద్దుతుంది. అంధ విశ్వాసులుగా మార్చదు. ఖుర్ఆన్ పదేపదే సదాచారాలకై ప్రోత్సహించింది. మనిషి సదా సత్యమార్గాన నడవాలని అందులో నొక్కి వక్కాణించబడింది.

## సామాజిక వ్యవస్థ

ఖుర్ఆన్ తనదైన- ప్రత్యేక- ఆచరణా విధానం కలిగి ఉంది. మనుషులలో పుట్టుక ఆధారంగా ఏర్పరచబడిన నిమ్నోన్నతలు ఖుర్ఆన్ దృష్టిలో అజ్ఞానానికి ప్రతీక. ఖుర్ఆన్ ప్రకారం మానవులంతా దైవదాసులే. ఆ విధంగా వారంతా ఒండొకరికి సోదరులే. పరస్పరం వారంతా సమానులే. ఒకవేళ మనిషీ- మనిషి మధ్య హెచ్చుతగ్గుల తారతమ్యం ఉండగలిగే మాటైతే అది కేవలం మంచితనం, సదాచారం, సౌశీల్యం, సిద్ధాంతాల ఆధారంగా మాత్రమే ఉండగలుగుతుంది. అంతేగాని వంశం, వర్ణం, జాతి, ప్రాంతం ఆధారంగా కాదు. వంశం, వర్ణం, జాతి, భాష, భౌగోళిక, రాజకీయ పరిమితులను అధిగమించి సర్వ వ్యాప్తమయ్యే సమాజాన్ని ఖుర్ఆన్ ప్రతిపాదిస్తోంది. తద్వారా మానవుల మధ్య సౌహార్ధాన్ని, సౌభ్రాతృత్వాన్ని, సమానతలను నిర్మించగోరుతుంది. వ్యక్తికీ- సమాజానికి మధ్యన సముచితమైన సంతులనాన్ని ఏర్పరచడానికి ఖుర్ఆన్ మానవ జీవితంలోని అన్ని కోణాలను సంస్కరిస్తుంది.

ఖుర్ఆన్ జూదం, మద్యపానం, మాదక ద్రవ్యాల సేవనం, స్త్రీ పురుషుల విచ్చలవిడి కలయికను వారిస్తుంది. ఎందుకంటే ఇవన్నీ వ్యక్తిగత, సామాజిక జీవితాన్ని అస్తవ్యస్తం చేసేస్తాయి.

## వివాహం

సామాజిక జీవితంలో ఖుర్ఆన్ వైవాహిక వ్యవస్థకు ఎంతో ప్రాముఖ్యతనిచ్చింది. అది వివాహానికి కొన్ని బంధుత్వ సంబంధాలను

నిషిద్ధంగా ఖరారు చేసి, మిగతా వాటిని ధర్మసమ్మతంగా నిర్ధారించింది. వర్గ తెగల మధ్య వివక్షను రూపుమాపడానికి వైవాహిక సంబంధాలు దోహదపడతాయని చెప్పింది. వివాహం ఇస్లామీయ సమాజంలో ఎంతో సరళమైన కార్యం. వధూవరుల పరస్పర అంగీకారానికి ఇద్దరు సాక్షులుంటే సరిపోతుంది. వివాహాన్ని సులభతరం చేస్తే సమాజంలో వ్యభిచారం కష్టతరం అయిపోతుంది.

## స్త్రీ స్థానం

కుటుంబంలో పురుషునికి బాధ్యతలు నిర్వర్తించటం దృష్ట్యా కుటుంబ పెద్దగా, యజమానిగా ఖరారు చేయటం జరిగింది. అంతమాత్రాన స్త్రీ కట్టుబానిసరాలు లేక దాసి అని దానర్థం ఎంతమాత్రం కాదు.

> **"విశ్వసించిన ప్రజలారా! బలవంతంగా స్త్రీలకు వారసులు కావటం మీకు ధర్మసమ్మతం కాదు. ఇంకా, వారిని వేధించి సాధించి మీరు వారికి ఇచ్చిన 'మహర్'లో కొంత భాగాన్ని కాజేసే ప్రయత్నం చెయ్యటం కూడా ధర్మసమ్మతం కాదు. అయితే వారు గనక బాహాటంగా చెడు నడతకు పాల్పడినట్లయితే (అప్పుడు వారి పట్ల కఠినంగా ప్రవర్తించే అధికారం మీకు ఉంది). వారితో సద్భావంతో జీవితం గడపండి. ఒకవేళ మీకు వారు నచ్చకపోతే, బహుశా మీకు ఒక విషయం నచ్చకపోవచ్చు. కాని అందులోనే అల్లాహ్ ఎంతో మేలును పెట్టి ఉండవచ్చు." (ఖుర్ఆన్ 4: 19)**

అంతేకాదు, స్త్రీల పట్ల సమభావంతో, ఆదరణతో మెలగాలని ఖుర్ఆన్ ఆదేశిస్తోంది. ఎందుకంటే మానవులంతా సమానులేనని, అందరి మూలం ఒక్కటేనని, వారి మధ్య వంశం, వర్ణం, లింగం, జాతి ఆధారంగా భేదభావం కనబరచటం అనుచితమని ఖుర్ఆన్ అంటోంది. పురుషుని కోసం అన్నిటికన్నా ఉత్తమ సంపద ఒక ఉత్తమ ఇల్లాలే. దైవప్రవక్త

ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లమ్) ఇలా ప్రవచించారు :

**“మీలోని ప్రతి ఒక్కరూ కృతజ్ఞతా పూర్వకమయిన హృదయాన్ని, అల్లాహ్ నామస్మరణ చేసే నోరును, పరలోక సాఫల్యానికి దోహదపడే కార్యాలలో మీకు తోడ్పడే ఇల్లాలిని  కలిగి ఉండాలి”. (హదీసు)**

ఇంకా ఇలా అన్నారు :

**“ప్రపంచం వస్తు సామగ్రితో నిండి ఉంది. అయితే ఈ వస్తు సామగ్రిలో అత్యుత్తమమైనది, మేలైనది సద్వర్తనురాలైన స్త్రీయే (ఇల్లాలే)”. (హదీసు)**

## బంధుత్వం

ఖుర్ఆన్ ఏమంటోందంటే–

మీ తల్లిదండ్రుల్ని ఆదరించండి, వారి పట్ల సద్భావంతో మెలగండి. వారి మాట వినండి. ఒకవేళ వారు ఏకేశ్వరుడైన అల్లాహ్‌ను కాకుండా వేరితరులను పూజించమని చెబితే మాత్రం వారి మాట వినవలసిన అవసరం లేదు. మరణ ఘడియలు సమీపిస్తున్నప్పుడు మీ సిరిసంపదల వ్యవహారంలో వీలు వ్రాయాలి. మీ ఆస్తిపాస్తుల్లో మీ తల్లిదండ్రుల, కన్న పిల్లల, సమీప  బంధువుల వాటా నిర్ధారించబడింది. బంధువుల  పట్ల ఉత్తమ రీతిలో వ్యవహరించమని, సద్వ్యవహారం చేయటం పుణ్యకార్యం అనీ ఖుర్ఆన్‌లో ఎన్నోచోట్ల తాకీదు చేయటం జరిగింది. బంధువులను ఉపేక్షించటాన్ని నిందార్హంగా ఖరారు చేయటం జరిగింది. ఒకవేళ ఎవరయినా బంధువుల పట్ల అన్యాయంగా, పక్షపాతంగా ప్రవర్తిస్తే అది ఖుర్ఆన్‌లో న్యాయ విరుద్ధ కార్యంగా పేర్కొనటం జరిగింది.

## పొరుగువారి పట్ల వ్యవహరణ

ఖుర్ఆన్ ఆదేశానుసారం పొరుగువారు సహాయసహకారాలకు, సానుభూతికి, సత్ప్రవర్తనకు పాత్రులు. ఆ మాటే హదీసులో ఈ విధంగా

చెప్పబడింది–

> **"ఏ వ్యక్తి వ్యవహరణ (ప్రవర్తన) ద్వారా అతని పొరుగువాడు సురక్షితంగా లేడో,అతను ధర్మావలంబీకుడు కాడు."**
>
> **(మహనీయ ముహమ్మద్–స)**
>
> **"తన పొరుగువాడు ఆకలితో అలమటిస్తూ ఉండగా, తాను మాత్రం కడుపు నిండా తినేవాడు ధర్మానికి బహుదూరాన ఉన్నాడు."**
>
> **(మహనీయ ముహమ్మద్–స)**

మహనీయ ముహమ్మద్ (సఅసమ్) ఇంకా ఇలా అన్నారు : మీ పొరుగువాడు గనక మిమ్మల్ని మంచివారుగా భావిస్తే, నిస్సందేహంగా మీరు మంచివారే. ఒకవేళ మీ పొరుగువానికి మీ పట్ల సదభిప్రాయం లేకపోతే మీరు మంచి మనిషి కారు.

ఈ విధంగా ఖుర్ఆన్ సామాజిక జీవితంలో సమస్త సత్కార్యాల, సద్గుణాల ద్వారా ఆరోగ్యకరమైన మూలికలను నెలకొల్పుతుంది.

## న్యాయబద్ధంగా వ్యవహరించాలి

మానవుడు ధర్మబద్ధంగా జీవనోపాధిని సముపార్జించి తమ అవసరాలను తీర్చుకోవాలని ఖుర్ఆన్ ప్రబోధిస్తోంది. తన అవసరాలు తీరాక మిగిలిన ధనాన్ని మనిషి నైతిక స్వభావానికి విరుద్ధం కాని విధంగా, సమాజానికి ఏ విధంగా కూడా హాని కలిగించని విధంగా వ్యయపరచాలని కూడా ఖుర్ఆన్ అంటోంది. ఉదాహరణకు– మద్యపానం, వ్యభిచారం, జూదం, సంపదను స్తంభింపజేయటం (ధన కేంద్రీకరణ), పిసినారితనం మొదలగు వాటిని అధర్మంగా ఖరారు చేసింది. ఇంకా ఖుర్ఆన్ ఇలా ప్రబోధిస్తోంది: ధర్మబద్ధంగా జీవనోపాధిని సంపాదించేవారిని దేవుడు ఇష్టపడతాడు. ఆకలిగొన్నవారికి అన్నం పెట్టండి. రోగుల సేవ చేయండి. కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోండి. మీకు ప్రియాతిప్రియమైన వస్తువుల్లో

నుండి దైవమార్గంలో ఖర్చుపెట్టనంత వరకూ మీరు పుణ్యకార్యాల స్థాయికి చేరుకోలేరు. (ఖుర్‌ఆన్, 3: 92)

వడ్డీ తీసుకోవటాన్ని ఖుర్‌ఆన్ నిషేధించింది :

**"ఓ విశ్వాసులారా! అనేక రెట్లు పెంచే ఉద్దేశంతో వడ్డీ సొమ్ము తినకండి. అల్లాహ్‌కు భయపడండి. తద్వారా మీరు సాఫల్యం పొందవచ్చు." (ఖుర్‌ఆన్, 3: 130)**

యాచించే వారికి, యాచించని అవసరార్థుల (Needy)కు కూడా సహాయం చేయాలని ఖుర్‌ఆన్ నిర్దేశించింది.

**"దారిద్ర్య భయంతో మీ సంతానాన్ని హతమార్చకండి. మేము వారికీ ఉపాధిని ఇస్తున్నాము, మీకూను. ముమ్మాటికీ వారి హత్య మహాపరాధం." (ఖుర్‌ఆన్, 17: 31)**

**"వారి సంపదల్లో అడిగేవారికీ, అడగని స్వాభిమానులకు కూడా హక్కు ఉంది." (ఖుర్‌ఆన్, 51: 19)**

**"ఇంకా వారి సొమ్ములలో నోరు తెరచి అడిగేవారికి, (ఆత్మాభిమానం కారణంగా) వంచితులైన వారికి కూడా నిర్ణీత హక్కు ఉంటుంది." (ఖుర్‌ఆన్, 70: 24,25)**

## వ్యక్తి స్వాతంత్ర్యం

ఖుర్‌ఆన్ మనిషి వ్యక్తిగత స్వాతంత్ర్యానికి పూర్తి హామీనిస్తుంది. మానవ జాతి మనుగడకు ఎంతవరకు అవసరమో అంతవరకే అతని స్వేచ్ఛను కట్టడి చేయాలని ఆజ్ఞాపిస్తుంది. ఎందుకంటే ప్రతి మనిషీ దైవ సమక్షంలో జవాబు ఇవ్వవలసి ఉంది. అందువల్ల మనిషి వ్యక్తిగత వికాసానికి, మంచి పనులు చేయడానికి పుష్కలంగా అవకాశాలు లభించాలి. అప్పుడే మానవ జీవితంలో దాతృత్వం, సానుభూతి, ఉపకారం తదితర సత్కార్యాలు క్రియాత్మక రూపం ధరించగలుగుతాయి.

ఖుర్‌ఆన్ ప్రకారం మానవ సమాజం బాగోగుల కొరకు పాటుపడే వాడే ఉత్తముడు.

**“నేలపై నిక్కుతూ నడవకు. నీవు నేలను చీల్చనూ లేవు. పర్వతాల ఎత్తుకు చేరుకోనూలేవు.” (ఖుర్‌ఆన్, 17: 37)**

అహంకారం, గర్వం మనిషిని నైతిక పతనం వైపునకు గొనిపోతుంది. ఈ దోషం మనిషిని సమాజం పాలిట హానికరంగా తయారు చేస్తుంది. పరస్పర సంబంధాలు మెరుగుపడాలంటే, సోదరభావం, సానుభూతి విరాజిల్లాలంటే జనులు ఒండొకరిని గౌరవించాలి. ఎదుటివారిని హీన దృష్టితో చూడకూడదు. వారి పట్ల అమానుషంగా వ్యవహరించకూడదు.

## సారాంశం

ఈ విధంగా ఖుర్‌ఆన్ సమస్త మానవ జాతి ముందు ఒక అపురూప మైన వ్యవస్థను సమర్పిస్తుంది. అందులో జీవితపు ఆధ్యాత్మిక, సామాజిక, ఆర్థిక, నైతిక కోణాలన్నీ వచ్చేస్తాయి. మానవ జీవితంలోని ఏ కోణం కూడా దాని పరిధికి వెలుపల ఉండదు. ఖుర్‌ఆన్ “మీ ధర్మం మీకు, నా ధర్మం నాకు” లాంటి మార్గ నిర్దేశన చేసి మత సామరస్యాన్ని నొక్కి వక్కాణిస్తోంది. అది చెప్పేదేమంటే ఖుర్‌ఆన్ ఏదో కొత్త మత వర్గపు సందేశాన్ని లోకంలోకి తీసుకుని రాలేదు. అదైతే మానవతను ఒకే మార్గంపై ఏకత్రం చేయగోరుతోంది. అదే ఈశ్వరుడు నిర్మించిన నియమాలను పాటించటం. సాధారణంగా ప్రజలు అసహ్యించుకునే, అన్ని మతాలు ఏవగించుకునే కార్యాలన్నింటినీ ఖుర్‌ఆన్ నిషిద్ధంగా ప్రకటించింది. మరే కార్యాలనయితే మానవ సమాజం మంచివిగా భావించిందో వాటిని ఖుర్‌ఆన్ ధర్మసమ్మతంగా ఖరారు చేసింది. ఖుర్‌ఆన్ మానవుణ్ణి దైవ ప్రతినిధిగా నమ్ముతుంది. అందుచేత అతడు దేవుని సమక్షంలో తాను చేసిన పనులన్నింటికీ జవాబు ఇవ్వాలి. ఈ పరలోక భావన మనిషిని సత్కార్యాల వైపునకు ప్రేరకశక్తిగా ఉంటుంది. ఖుర్‌ఆన్ మనిషి వ్యక్తి

స్వాతంత్ర్యాన్ని సమర్థిస్తుంది. అదే సమయంలో అది, మనిషి తన సముపార్జనను న్యాయబద్ధంగా వ్యయపరచాలని చెబుతుంది. ఖుర్‌ఆన్ ప్రకారం సదాచరణ మత ధర్మం యొక్క మౌలిక తత్వం. విధి వ్రాతను నమ్ముకుని మీనమేషాలు లెక్కించుకుంటూ, గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోవటాన్ని ఖుర్‌ఆన్ సమ్మతించదు. ఎందుకంటే ఈ నమ్మకం మనిషిని బద్ధకస్తునిగా, సోమరిపోతుగా తయారు చేస్తుంది. అతనిని సదాచరణకు సమాయత్తం కాకుండా ఆపుతుంది.

సత్కార్యాలలో మనుషులు ఇతోధికంగా పాల్గొనాలి; చెడులకు దూరంగా ఉండేందుకు శాయశక్తులా ప్రయత్నించాలన్నది ఖుర్‌ఆన్ ఆదేశం. మనిషి చేసుకున్న దానికి చేసుకున్నంత ప్రాప్తమవుతుందని అది అంటోంది.

ఖుర్‌ఆన్ మనిషికి మానవీయ గుణాన్ని ప్రదానం చేస్తుంది. మానవీయ దృష్టి కోణాన్ని వికసింపజేయడానికి, దేవుని యందు విశ్వాసాన్ని, అనువర్తనాన్ని, సంయమనాన్ని, స్వచ్ఛమైన ఆచరణను పెంపొందించడానికి ఖుర్‌ఆన్‌లో విశ్వసనీయమైన సిద్ధాంతం ప్రతిపాదించబడింది. ఇంకా దానికి క్రియాత్మక రూపం ఇవ్వడానికి నమాజ్, ఉపవాసం, జకాత్, హజ్జ్‌ల వ్యవస్థను ప్రవేశపెట్టడం జరిగింది.

మానవుని కొరకు ఏ శ్రేయస్కర మార్గాన్ని దేవుడు సమ్మతించి ఆమోదించాడో దానిని ఖచ్చితంగా అనుసరించాలని ఖుర్‌ఆన్ ఉపదేశిస్తోంది. దాంతోపాటు ముహమ్మద్ ప్రవక్త(స) స్వయంగా తన జీవిత కాలంలో మానవ జాతి కొరకు ఏ కార్యాలను ఆచరించి చూపారో, అవి అద్దం మాదిరిగా చాలా స్పష్టంగా ఉన్నాయి. మనం గనక బాహ్య ఆడంబరాలను వదలి, ఖుర్‌ఆన్‌ను అనుసరించినట్లయితే, మన ప్రయత్నాల ద్వారా సమస్త మనుజ జాతిని ఏకత్వపు సూత్రంపై నిలబెట్టగలం. అందులో జాతి, వర్గం, వర్ణం, నిమ్నోన్నతలకు తావుండదు. మహాప్రవక్త

ముహమ్మద్(స) దారి తప్పిన మానవాళికి చూపిన ఏకైక మార్గం ఏమిటంటే, జీవితాన్ని సఫలీకృతం చేసుకోవడానికి మనుషులు ఒకే దైవాన్ని ఆరాధించి, సదాచరణ చేయాలి. మానవుడు స్వార్థాన్ని వీడి, మనోవాంఛలను త్యజించి మానవ కళ్యాణం కొరకు పాటుపడాలి. ఒండొకరి యెడల సద్వ్యవహారం చేయాలి. తద్వారా వారు దైవ సామీప్యం పొందగలరు.

'అస్సలాము అలైకుమ్ వ రహ్మతుల్లాహి'

(మీ అందరిపై శాంతి వర్షించుగాక! మీకు ప్రభువు కృప ప్రాప్తమవుగాక!!)